

బీఆర్ఎస్‌కు భారీ షాక్
● కాంగ్రెస్‌లో చేరిన నాగల్‌గిద్ద, నిజాంపేట ఎంపీపీలు 7



శ్రీ సీతారాముల బంగారు ఆభరణములు



భక్తులకు సీతమ్మతల్లికి కట్టే మంగళసూత్రం చూపిస్తున్న జగ్గారెడ్డి



బంగారు ఆభరణాలను ఊరేగింపుగా తన నివాసం నుంచి రామ్‌మందిర్‌కు తెస్తున్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

సంగారెడ్డిలో జగ్గారెడ్డి దంపతులచే అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

సంగారెడ్డి, ఏప్రిల్ 17: సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీ సీతా రాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ సీతారాముల బంగారు ఆభరణాలను ఉదయమే తన నివాసం నుంచి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాలతో ఊరేగింపుగా రామ్ మందిర్‌కు తీసుకువచ్చారు. రామ్‌మందిర్‌లో రాత్రి జరిగిన శ్రీ సీతారామ కళ్యాణం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ పర్యావేక్షణలో జ్యోతిర్వాను విద్యాపీఠం సిద్దాంతి మహేశ్వర శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి సీతమ్మ కోసం తయారు చేయించిన మంగళసూత్రంను భక్తులకు చూపించారు. కళ్యాణంలో జగ్గారెడ్డి దంపతులు సీతమ్మ తల్లి శ్రీరామ చంద్రుల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలను పోశారు. అనంతరం ఈ తలంబ్రాలను వేడుకలకు హాజరైన చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలకు జగ్గారెడ్డి దంపతులు అందజేశారు.



కళ్యాణంలో పాల్గొన్న జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి



కళ్యాణంలో శ్రీ సీతారాముల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలు పోస్తున్న జగ్గారెడ్డి దంపతులు



కళ్యాణంలో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు



తన నివాసంలో బంగారు ఆభరణాలకు పూజ చేస్తున్న జగ్గారెడ్డి దంపతులు




సీతమ్మ తల్లి విగ్రహం మెడలో మంగళసూత్రధారణ



జహీరాబాద్ మండలం కొత్తూర్(బి)లోని కోదండరామాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కల్యాణం.. కమనీయం



పెద్దశంకరంపేటలో కల్యాణ మహోత్సవంలో చింతాకు పుస్తెను చూపిస్తున్న అర్చకుడు



మెదక్ కోదండ రామాలయంలో కొలువైన సీతారామ లక్ష్మణులు

సర్వాంగసుందరంగా అలంకరించిన పందిళ్లు.. మేళతాళాల చప్పుళ్లు.. వేదమంత్రాలు... భక్తుల జయజయధ్వానాల మధ్య సీతారాముల కల్యాణం నయనానందకరంగా జరిగింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని ఆలయాల్లో బుధవారం నిర్వహించిన వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు జానకీరాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తన్మయత్వం చెందారు.



కౌడిపల్లిలోని అభయ రామలయంలో తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



జోగిపేటలోని హనుమాన్ ఆలయంలో హారతి ఇస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈత..గౌడ్‌లకు చేయూత

- హరితహారంలో ఐదెకరాలలో ఐదు వేలకుపైగా మొక్కలు
- ప్రస్తుతం చేతికందిన 600 చెట్లు 7
- రోజూ 500 లీటర్ల కల్లు ● 60 మంది గౌడన్నలకు ఉపాధి

20న మెదక్‌కు సీఎం రేవంత్

- రాందాస్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ

మెదక్, ఏప్రిల్ 17 : కాంగ్రెస్ పార్టీ మెదక్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి నీలం మధు ఈనెల 20వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైదరాబాద్ శివారులోని శామీర్‌పేటలోని ఓ అతిథి గృహంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎంపీ అభ్యర్థి నీలం మధు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, పటాన్‌చెరు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ ప్రెసిడెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమానికి భారీ జనసమీకరణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. అభ్యర్థి ప్రచారానికి సంబంధించి నియోజకవర్గం నుంచి మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. నామినేషన్ కార్యక్రమాన్ని ప్రతీ కార్యకర్త ఛాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- కలెక్టరేట్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 17 : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో నేటి నుంచి కీలక ఘట్టానికి తెరలేవనుంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. మెదక్ పార్లమెంట్ పరిధి నామినేషన్లను మెదక్ కలెక్టరేట్‌లో స్వీకరించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్లకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరు తెలిపారు. సెలవు రోజైన ఆదివారం మినహాయిస్తే మిగతా అన్ని పనిదినాల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. నిర్ణీత గడువు, సమయంలోగా రిటర్నింగ్ అధికారి ఛాంబర్ వద్దకు చేరుకున్నవారి నామినేషన్ల ఫారాలను మాత్రమే స్వీకరిస్తామని కలెక్టర్ ఇదివరకే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని లోనికి అనుమతిస్తామని కలెక్టర్ వివరించారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయం

నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ25 వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన వారైతే రూ.12,500ను సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో జమచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మొత్తాన్ని నగదు రూపేణా, చలానా రూపంలో చెల్లించవచ్చని, చెక్కులు అంగీకరించరని స్పష్టం చేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేస్తున్న నియోజకవర్గంలోని ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుందని తెలిపారు. గుర్తింపు లేని పార్టీల తరఫున పోటీ చేసే వారితో పాటు స్వతంత్ర అభ్యర్థులను పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్‌ను సమర్పించేందుకు వచ్చేవారు పార్టీ కండువాలు, టోపీలు ధరిస్తే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు ఇటీవల మూడు నెలల్లోపు దిగిన పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అఫిడవిట్‌పై అతికించాలన్నారు. ఇతర పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన అభ్యర్థులు తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వో నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరవాలని దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ పక్కాగా రికార్డులు నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చుచేయొచ్చని కలెక్టర్ క్రాంతి వల్లూరు వివరించారు.

మెదక్‌లో కట్టుదిట్టమైన బందోబస్తు : ఎస్పీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 17: నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందు మూడు అంచెల పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు మెదక్ ఎస్పీ బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ ఫోర్స్, ఆర్మ్‌డ్, సివిల్ ఫోర్స్‌తో భద్రతను నిర్వహిస్తున్నామని తెలిపారు. మెదక్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి ఛాంబర్ నుంచి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తును నిర్వహిస్తామని ఎస్పీ వెల్లడించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని మంత్రి దామోదర్‌కు ఆహ్వానం

జోగిపేట, ఏప్రిల్ 17: మండలంలోని కన్‌సాన్‌పల్లిలో చేపట్టనున్న శ్రీరేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాల్సిందిగా మంత్రి దామోదర్‌ను గౌడ సంఘం సభ్యులు ఆహ్వానించారు. బుధవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో వారు కలిశారు. కన్‌సాన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠాపన క్రతువును ఈనెల 26 నుంచి 29 వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మంత్రిని కలిసిన వారిలో కన్‌సాన్‌పల్లి మాజీ సర్పంచ్ యాదాగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కార్యదర్శి అశోక్‌గౌడ్, సభ్యుడు రవీందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 17: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. సిద్దిపేట పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన పర్వతం కనకయ్య(30) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం సిరిసిల్ల రోడ్డు పక్కన ఉన్న బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడు. అది చూసిన కొంతమంది వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి గజ ఈతగాళ్లు రూ.25 వేలు అడిగారు. అన్ని డబ్బులు ఇచ్చేంత స్థోమత మృతుడి కుటుంబ సభ్యులకు లేకపోవడంతో గమనించిన ఏఎస్‌ఐ ఉమారెడ్డి తానే స్వయంగా బావిలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీసి మానవత్వాన్ని చాటుకున్నాడు. అక్కడున్నవారు ఏఎస్‌ని అభినందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం

బీఆర్ఎస్‌కు భారీ షాక్

● కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీలు, పలువురు మాజీ సర్పంచులు



ఖేడ్‌లో సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగల్‌గిద్ద ఎంపీపీ మోతిబాయి, తదితరులు

నిజాంపేట, ఏప్రిల్ 17: నిజాంపేట మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బుధవారం ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, తాజా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమర్‌సేనారెడ్డి, పలువురు సర్పంచులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ ఆధ్వర్యంలో మెదక్ అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్మెడ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, తిప్పనగుళ్ల, రజాక్‌పల్లి గ్రామాలకు చెందిన నాయకులు మంగలిపల్లి యాదగిరి, ధర్మా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాగల్‌గిద్ద ఎంపీపీ మోతిబాయి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17: ఖేడ్ నియోజకవర్గం నాగల్‌గిద్ద బీఆర్ఎస్ ఎంపీపీ మోతిబాయి తన అనుచరులతో బుధవారం మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా నిజాంపేట మండలం నాగ్‌ధర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొడ్ల వెంకటేశంతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు సైతం షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరినవారికి షెట్కార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాగల్‌గిద్ద జడ్పీటీసీ రాజురాథోడ్ ఇటీవల బీజేపీలో చేరగా, తాజాగా ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలినట్లయింది.



ఎమ్మెల్యే రోహిత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ, మాజీ సర్పంచులు

మూడుసార్లు పర్వతారోహణ చేసిన ఎన్‌సీసీ కేడెట్



పర్వతారోహణ చేస్తున్న రాజేశ్

గజ్వేల్, ఏప్రిల్ 17: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ రాజేశ్ వరుసగా మూడో సారి పర్వతారోహణ చేశాడు. కరోనా సందర్భంగా ఆగిపోయిన ఎన్‌సీసీ పర్వాతారోహణ క్యాంపు పునఃప్రారంభమైన వెంటనే తెలంగాణ నుంచి పర్వాతారోహణ చేసి అరుదైన అవకాశాన్ని పొందాడు. రాజేశ్ ప్రస్తుతం బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్లుగా వరుసగా బేసిక్, అడ్వాన్స్‌డ్, సెర్చ్ అండ్ రెస్క్యూ క్యాంపులను పూర్తి చేశాడని ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం.భవానీ తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో 2022 అక్టోబరు 1 నుంచి 26 వరకు బేసిక్ మౌంటెనెరింగ్ క్యాంపులో, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో 2023 ఏప్రిల్ 1 నుంచి 28 వరకు అడ్వాన్స్ మౌంటెనెరింగ్ క్యాంపులో పాల్గొన్నాడు. అలాగే 2024 మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీవరకు 20రోజుల పాటు ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలో సెర్చ్ అండ్ రెస్క్యూ క్యాంపులో పాల్గొన్నానని రాజేశ్ తెలిపాడు. అంతేకాకుండా బీఎంసీ క్యాంపులో భాగంగా రాక్ క్లైంబింగ్ రివర్ క్రాసింగ్, మంచు పర్వతాలు అధిరోహించడంతో పాటు దాదాపు 14 వేల అడుగుల ఎత్తును ఎక్కినట్లు చెప్పాడు. బీఎంసీ క్యాంపులో భాగంగా అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్‌తో దాదాపు 17 వేల అడుగుల పర్వతారోహణ పూర్తిచేసినట్లు రాజేశ్ పేర్కొన్నాడు. ఆపద సమయంలో ఆదుకునే సెర్చ్ అండ్ రెస్క్యూను నూతన పద్ధతుల ద్వారా శిక్షణ పొందానని, ఈ శిక్షణకు సహాయపడిన సంగారెడ్డి కమాండింగ్ అధికారి కల్నల్ పీఎస్ నందాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు రాజేశ్‌ను అభినందించారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు





పొన్నాల సమీపంలోని కిష్టసాగర్ పరిధిలో ఈత వనంలో చెట్లు గీస్తున్న గౌడన్నలు

- హరితహారంలో ఐదు ఎకరాలలో ఐదు వేలకుపైగా మొక్కలు
- ప్రస్తుతం చేతికందిన 600 చెట్లు
- ప్రతిరోజూ 500 లీటర్ల కల్లు
- 60 మంది గౌడన్నలకు ఉపాధి

ఈత.. గౌడ్‌లకు చేయూత



సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17: సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన ఈత వనాలు గౌడ్‌లకు ఉపాధిని చూపుతున్నాయి. మొత్తం 600 చెట్ల నుంచి ప్రతిరోజూ 500 లీటర్ల కల్లు వస్తున్నది.

గౌడన్నలకు చేయూతగా ప్రభుత్వాలు

గౌడన్నలకు చేయూతనందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిష్టసాగర్ గ్రామ సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే మొన్నటివరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో సుమారు 5 వేల ఈత మొక్కలను దశలవారీగా గౌడన్నలు నాటుకున్నారు. వాటి సంరక్షణ కోసం 60 మంది గౌడ కులస్తులు సొసైటీ ఏర్పాటు చేసుకుని పరిరక్షిస్తున్నారు.

మొక్కలు ఎదిగి..

దశలవారీగా నాటుకున్న 5 వేల ఈత మొక్కలలో ప్రస్తుతం 600కు పైగా ఈత చెట్లు చేతికందాయని గౌడ కులస్తులు చెబుతున్నారు. రోజూ 300 చొప్పున ఈత చెట్లకు కల్లు గీస్తున్నారు. రోజుకు సుమారు 500 లీటర్ల స్వచ్ఛమైన కల్లు లభిస్తుంది. వచ్చేనెల 15 రోజుల్లో మరో 600 చెట్లు చేతికిందే అవకాశం ఉండడంతో మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉన్నది.

ఆర్థిక భరోసాకు చక్కటి మార్గం

గతంతో పోల్చుకుంటే గ్రామాల్లో ఈత వనాల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో గౌడ కులస్తులకు ఉపాధి తగ్గే పరిస్థితి వచ్చింది. ఆ సందర్భంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు కృషితో గౌడ కులస్తులకు ఈత మొక్కలను పంపిణీ చేశారు. గౌడ సొసైటీలకు సంబంధించిన స్థలం ఎక్కడుంటే అక్కడ మొక్కలను నాటుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ అవకాశమే నేడు పొన్నాల గౌడ కులస్తులు ఆర్థికంగా ఎదగడానికి చక్కటి మార్గాన్ని చూపింది. సొసైటీలో మొత్తం 60 మంది సభ్యులు ఉండగా.. కొంతమంది కార్మికులు ఆరోగ్యరీత్యా, వయస్సు రీత్యా వృత్తిలోకి రానప్పటికీ మిగతా గౌడన్నలు వారి చెట్లను దత్తత తీసుకొని వృత్తిని కొనసాగిస్తున్నారు.

చేతినిండా పని దొరుకుతుంది

గతంలో పని దొరక్క అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతానికి ఈత వనంలో వందల సంఖ్యలో చెట్లు చేతికందడంతో పని దొరుకుతుంది. ఆర్థికంగా కూడా చక్కటి అవకాశం లభిస్తుంది.

- సురేష్‌గౌడ్, పొన్నాల

కులవృత్తులను ప్రోత్సహించడానికే..



కులవృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా అన్నిరంగాల కులస్తుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందించాం. అవకాశాలను సద్వినియోగపర్చుకుని గౌడన్నలు ఆర్థికంగా ఎదగడం సంతోషాన్నిస్తుంది. కులవృత్తులను ఉపయోగించుకుని అన్ని కులాల వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాం.

- హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

ఆర్థికంగా మాకు ఎంతో అండ



గ్రామీణ ప్రాంతాల్లో ఈతవనాల సంఖ్య తగ్గిపోవడంతో కులవృత్తులు చేపట్టలేక ఇతర వృత్తుల కోసం వెతికే సమయంలో ప్రభుత్వాల అండదండలతో ఏర్పాటు చేసుకున్న ఈత వనం మా ఆర్థికాభివృద్ధికి అండగా నిలబడింది. పనులు చేతికందని సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో 600 చెట్లు చేతికంది మాకు లాభాలను అందిస్తున్నాయి.

- బొల్గం శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల



కల్లును విక్రయిస్తున్న గౌడ కులస్తులు



ఏపుగా పెరిగిన ఈతవనం

కల్యాణ వైభోగం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 17: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. రెండు జిల్లాల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో తీరొక్క పందిళ్లు, మేళతాళాల చప్పుళ్లు, ఎదుర్కోళ్లు, పూజారుల వేద మంత్రాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. జోగిపేటలోని వీర, పబ్బతి హనుమాన్ ఆలయం, టేక్మాల్ మండలం వేల్పుగొండ రామచలం గుట్టపై, హత్నూర మండలం మాధుర గ్రామ శివారులో గల దత్తాచల క్షేత్రంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్‌లోని కోదండ రామాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కోదండ రామాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. సంగారెడ్డిలోని గురు దత్తాత్రేయ సాహితీ సాయిబాబా ఆలయం, కంది మండలంలోని చేర్యాల రామాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూజలు చేశారు. నర్సాపూర్ మండలంలోని సీతారాంపూర్ ఆలయం, చిలప్‌చెడ్ మండల పరిధిలోని రాందాసుగూడాలో వేడుకలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీరాంమందిర్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్దశంకరంపేట రామాలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.


మెదక్‌లోని కోదండరామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రోహిత్‌రావు దంపతులు


పటాన్‌చెరులో కోదండరామాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతులు


సంగారెడ్డిలోని గురుదత్తాత్రేయ సాహితీ సాయిబాబా ఆలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్


చిలప్‌చెడ్: రాందాసుగూడాలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునితారెడ్డి


ఖేడ్‌లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు


జహీరాబాద్‌లోని రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, అనిల్‌కుమార్


పాపన్నపేటలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు


నిజాంపేట మండల కేంద్రంలో..


చేగుంట పంచముఖ హనుమాన్ దేవాలయంలో..


నార్సింగ్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి


చౌటకూర్ మండల కేంద్రంలో..


వట్‌పల్లి మండలం సాయిపేటలో పల్లకీ సేవ..


కోహిర్‌లోని రామ్ మందిర్ వద్ద..


ఝరాసంగం మండలం కుప్పానగర్‌లో..


హవేళీఘణపూర్ మండల కేంద్రంలో..


మునిపల్లి మండలం ఖమ్మంపల్లిలో..


వెల్దుర్తి మండల కేంద్రంలో..


తూప్రాన్‌లో సీతారాములను దర్శించుకున్న నీలం మధు


కల్హేర్ రామాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి


రామాయంపేట రామాలయంలో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పూజలు


కొల్చారం మండలం రంగంపేటలో..


శివ్వంపేట: చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో..


గుమ్మడిదలలోని రామచంద్రస్వామి ఆలయంలో..


జిన్నారం మండల కేంద్రంలో..


అల్లాదుర్గంలోని వెంకటేశ్వరాలయంలో..


మెదక్‌లో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

గ్రామ గ్రామాన బీజేపీ ప్రచారం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 17: పెద్ద శంకరంపేట మండలంలో గ్రామ గ్రామాన బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, శ్రీహరి, సురేందర్ రెడ్డి, విఠల్,గంగారెడ్డి, సురేష్, విజయ్‌కుమార్, బొగడాల కృష్ణ పాల్గొన్నారు.

శివ్వంపేట మండలంలో

శివ్వంపేట, ఏప్రిల్ 17: మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్‌యాదవ్, మండలాధ్యక్షుడు పెద్దపులి రవి పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 17: అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట అంబలి వితరణ కేంద్రాన్ని బుధవారం పట్టణ సీఐ భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు వనజ, పట్టణ ఎస్ఐ క్రాంతి పాటిల్, సంయుక్త, కవిత, అర్చన, భాగ్యలక్ష్మి, మనీలా, స్వాతి, కీర్తన, నిర్మల, సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో పోలీసు కవాతు

వెల్దుర్తి, ఏప్రిల్ 17: వెల్దుర్తి ఎస్ఐ నవత ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ సీఐ కృష్ణ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూ విక్రయం

రామచంద్రాపురం, ఏప్రిల్ 17: నకిలీ పత్రాలతో భూమిని విక్రయించిన వ్యక్తిని బుధవారం పోలీసులు రిమాండుకు తరలించారు. 2006వ సంవత్సరంలో మనోజ్‌కుమార్ జైన్ అనే వ్యక్తి మండలంలోని కొల్లూరు గ్రామ పరిధిలోని 177వ సర్వే నంబరులో ఉన్న తన 2.27ఎకరాల భూమిని విక్రయించాడు. 2023లో తన పేరుపైన నకిలీ సేల్ డీడ్ సృష్టించుకుని తిరిగి ఓ ప్రైవేటు సంస్థకు విక్రయించాడు. సదరు ప్రైవేటు సంస్థ మనోజ్‌కుమార్ నుంచి కొనుగోలు చేసిన భూమికి ఆనుకుని ఉన్న సుభాష్‌గౌడ్‌కు చెందిన భూమిని కబ్జా చేసి ప్రహరీని నిర్మించింది. సుభాష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మనోజ్‌కుమార్ జైన్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించారు.

సన్నాహక సభను జయప్రదం చేయాలి


చేగుంటలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, ఏప్రిల్ 17: దుబ్బాక నియోజకవర్గం భూంపల్లిలో రేపు జరిగే మెదక్ పార్లమెంటరీ సన్నాహక సభను విజయవంతం చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం చేగుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ పార్లమెంటు సన్నాహక సభకు మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు హాజరవుతున్నట్లు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు రాజేంద్రరెడ్డి, భాస్కర్, శ్రీకాంత్, శ్రీను, నర్సింహులు, స్టాలిన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

తూప్రాన్, ఏప్రిల్ 17: సివిల్స్‌లో 639 ర్యాంకు సాధించిన నర్సంపల్లి లింబ్యానాయక్ తండాకు చెందిన కే.అర్పితను తండావాసులు బుధవారం సన్మానించారు. అర్పిత సివిల్స్‌కు ఎంపిక కావడం గర్వంగా ఉన్నదని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మనాయక్ అన్నారు.


అర్పితను సన్మానిస్తున్న తండావాసులు

అందుబాటులోకి రాని వైకుంఠధామాలు

- కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా పనులు
- నిర్మాణం పూర్తయినా దారిలేక అవస్థలు
- నందిగామలో వినియోగంలోకి రాని శ్మశానవాటిక

నిజాంపేట, ఏప్రిల్ 17: గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో వైకుంఠధామాలను మంజూరు చేయగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు వచ్చాయి. అయితే నిజాంపేట మండలంలో చాలా వరకు నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లోని కాలువ గట్లు, దారుల పక్కన, చెరువులు, వాగుల పక్కన ఉన్న స్థలాలే శ్మశానవాటికలు అవుతున్నాయి. వర్షాకాలంలో దహనం చేయడానికి ఇబ్బంది పడాల్సిందే. మండలానికి 14 శ్మశానవాటికలు మంజూరు కాగా మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి భూమి పూజ చేశారు. కొన్నిచోట్ల పనులు పూర్తికాకపోవడం,


బచ్చురాజ్‌పల్లిలో దారిలేని వైకుంఠధామం


నస్కల్ గ్రామంలో అసంపూర్తిగా వైకుంఠధామం

మరికొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తేకపోవడంతో అంతిమ సంస్కారాల నిర్వహణకు భూమిలేని పేదలు ఇబ్బందులు పడుతున్నారు. నస్కల్ గ్రామంలోని ఈదులకుంటలో శ్మశానవాటిక పనులు చేపట్టినా పూర్తి కాలేదు. కుంట నిండితే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడాల్సిందే. బచ్చురాజ్‌పల్లి గ్రామంలో శ్మశానవాటిక నిర్మాణం పూర్తయినా దారి లేకపోవడంతో వినియోగించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు శ్మశానవాటికకు స్థల సేకరణ చేశారుగానీ రహదారికి భూసేకరణ చేయలేదు. గ్రామస్థులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

23న అంబేడ్కర్, పూలే జనజాతర


సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్


సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 17: మహనీయులను స్మరించుకుంటూ సంగారెడ్డిలో సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న జనజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ తెలిపారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జనజాతరకు జిల్లాలోని మేధావులు, విద్యావంతులు భారీ సంఖ్యలో హాజరై విజవయంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి దాస్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుతో ఇబ్బందులు

నర్సాపూర్, ఏప్రిల్ 17: మండలంలోని చిప్పల్‌తుర్తి నుంచి ఎల్లారెడ్డిగూడతండా మీదుగా మూసాపేట వరకు ఉన్న బీటీ రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో అత్యంత ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ మార్గంపై ఆధారపడి పలు తండావాసులతో పాటు సమీప గ్రామాల వారు నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి, కంకర తేలి ఉండడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయపడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే రోడ్డు దెబ్బతిన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతు చేసి, వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ధ్వంసమైన ఎల్లారెడ్డిగూడ-మూసాపేట రోడ్డు

చేపల వల కాళ్లకు చిక్కుకొని వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

నిజాంపేట, ఏప్రిల్ 17: చేపల వల కాళ్లకు చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన నీరటి వెంకటేష్(40) మంగళవారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం చెక్ డ్యాంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. కాళ్లకు చేపల వల చిక్కుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అన్నాసాగర్ చెరువులో మృతదేహం లభ్యం

జోగిపేట, మార్చి 17: మండలంలోని అన్నాసాగర్ గ్రామ చెరువులో బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైందని జోగిపేట ఎస్ఐ అరుణ్‌గౌడ్ తెలిపారు. పుల్కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన ఆత్మకూరి బీరయ్య(31) ఈ నెల 15న రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం అన్నాసాగర్ చెరువులో శవమై కనిపించాడు. జోగిపేట ఎస్ఐ అరుణణ్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా వ్యక్తిగత కారణాలతోనే బీరయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి భార్య ఆత్మకూరి మాధవి పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తగా దేవిశ్రీప్రసాద్



జహీరాబాద్, ఏప్రిల్ 17: జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ సమన్వయకర్తగా దేవిశ్రీప్రసాద్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. జహీరాబాద్‌పై పట్టుఉండడం, గతంలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో బీఆర్ఎస్ అధిష్టానం మరోమారు సమన్వయకర్తగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలి అనిల్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరికలు


వచనా పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన వరప్రసాద్, అనుచరులు

అల్లాదుర్గం, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ వరప్రసాద్ తన అనుచరులతో కలసి బుధవారం బీజేపీలో చేరారు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన వరప్రసాద్ జిల్లాలో మొట్టమొదటి రైతువేదిక నిర్వహణ కోసం తన ఇంటిని మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో విరాళంగా అందజేసిన కార్యకర్తగా గుర్తింపును పొందారు. బీఆర్ఎస్‌లో తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని పార్టీ కార్యకలాపాలకు కొంత కాలంగా దూరంగా ఉంటున్నారు. బుధవారం జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ కోడలు వచనా పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కంచరి బ్రహ్మం, నాయకులు పట్నం సత్యం, శంకర్, సందీప్, మల్లేశం, శంకరప్ప పాల్గొన్నారు.